# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 129
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
ఫిబ్రవరి 11, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు పూర్తి

- అధికారుల సూచనలు భక్తులు పాటించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



# రేపటి నుంచి..
# మినీ జాతర

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సంప్రదాయ బద్ధంగా పూజలు | పోటెత్తుతున్న భక్తజనం

కష్టాలన్నీ తొలగి పోవాలంటూ వేడుకోలు

బంగారాన్ని కానుకగా సమర్పిస్తున్న భక్తులు

వివరాలు2లో..

దక్షిణ భారత కుంభమేళాగా ఖ్యాతిగడించిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతరకు అధికారులు, పూజారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మాఘ శుద్ధ పౌర్ణమి ఫిబ్రవరి 12న ప్రారంభం కానున్న జాతర నాలుగు రోజుల పాటు జరుగనుంది. ఈ జాతర నిర్వహణకు వారం రోజుల ముందునుంచే ఆదివాసీల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మేడారంతో పాటు అనుబంధ గ్రామాల్లో ఊరుకట్టు నిర్వహించి, ఆలయాలను శుద్ధి చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. మినీ జాతరకు నెల రోజుల ముందునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవార్లను దర్శించుకొని తమ కష్టాలన్నీ తొలగి పోవాలంటూ వేడుకుంటున్నారు. బంగారాన్ని కనుకలుగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే మినీ జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. - వరంగల్ వాయిస్, మేడారం




2లో..

## దేశ వ్యాప్త జనాభా లెక్కలు జరపాలి

- మాజీ ఎంపీ వినోద్ కుమార్




8లో..

## ఆదరబాదరా నివేదికతో బీసీలకు మోసమే

డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన రావు


## పెద్దకర్మ



స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శు॥ చవితి
తేది 02-02-2025 ఆదివారం రోజున ఉ॥ గం॥04-05 ని॥లకు
మా తల్లి గారైన

**కీ॥శే॥ చిలుక ఇందిర గారు**

స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది 12-02-2025 బుధవారం రోజున ఏకాదశ దినకర్మ జరుపబడును
కావున తామంతా విచ్చేసి మా తల్లి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.

**కార్యస్థలము :**
మా స్వగృహం, ఇ.నెం. 2-7-5/1, మేన్‌రోడ్,
ఎక్సైస్ కాలనీ, హన్మకొండ.
సెల్ : 9885594560, 8801951787

ఇట్లు
కుమారుడు-కోడలు : డా॥ చిలుక కిరణ్-డా॥ కృష్ణవేణి
కూతుర్లు-అల్లుండ్లు : పిట్ట శ్రీదేవి-వేణునాథ్
: నాగరపు శిరీష-సురేష్
మనుమలు మరియు మనుమరాండ్లు

సహపంక్తి భోజనము : మ॥ గం॥ 12-30 ని॥లకు
రాధ గ్రాండ్ బాంకెట్ హాల్, ఎక్సైస్ కాలని, పోలీస్ స్టేషన్ ప్రక్కన,
సుబేదారి, హన్మకొండ.



# రేపటినుంచి.. మినీ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సంప్రదాయ బద్ధంగా పూజలు
- పోటెత్తుతున్న భక్తజనం
- కష్టాలన్నీ తొలగి పోవాలంటూ వేడుకోలు
- బంగారాన్ని కానుకగా సమర్పిస్తున్న భక్తులు

**వరంగల్ వాయిస్, మేడారం :** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మినీ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. తెలంగాణలో గిరిజనుల అతి పెద్ద పండుగ మేడారం జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ఈ జాతర రెండు సంవత్సరాలకొకసారి ఘనంగా నిర్వహిస్తారు. అయితే ఈ జాతరకు ఏటేటా భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోంది. అంతేకాదు మినీ జాతరకు సైతం భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి ఫిబ్రవరి 12, 13, 14, 15 తేదీల్లో సమ్మక్క సారక్క మినీ మేడారం జాతర నిర్వహించేందుకు ఆదివాసి పూజారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ జాతర నిర్వహణకు వారం రోజుల ముందే ఆదివాసీల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మేడారంతో పాటు అనుబంధ గ్రామాలు, ఆలయాలతో ఊరుకట్టు నిర్వహించి, ఆలయాలను శుద్ధి చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే అమ్మవార్లను రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లతో పాటు ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తజనం తరలిరానున్నారు.

### రెండేళ్లకోసారి..

రెండేళ్లకోసారి సమ్మక్క–సారలమ్మ మహా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో మినీ జాతరకు కూడా భక్తుల తాకిడి పెరుగతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే మినీ జాతరకు ప్రాశస్త్యం వచ్చింది. మినీ జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు మేడారం గ్రామంలోని సమ్మక్క ఆలయంలో ఆదివాసీ పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే సమయంలో కన్నేపల్లిలోని సారలమ్మ ఆలయంలో, కొండాయిలోని గోవిందరాజు, పూనుగొండ్లలోని పగిడిద్ద రాజు ఆలయంలో కూడా పూజలు చేశారు. అదే విధంగా బయ్యక్కపేటలో సమ్మక్క పూజారులు గుడిమెలిగెను ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించగా నాయకపోడు పూజారులు ఘట్టమగుట్ట వద్ద ఎదురుపిల్ల వేడుక నిర్వహించారు. అదే సమయంలో పొలిమేర దేవతలకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలకు అంకురార్పణ చేశారు.

### పూజలు మాత్రమే..

మినీ మేడారం జాతరకు కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడనున్నాయి. అయితే మహా జారతలో మాదిరిగా మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకు వచ్చే ఘట్టం ఉండదు. గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలుమాత్రమే నిర్వహిస్తారు. అయితే భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు తల్లులను చూసి పులకించిపోతారు. గద్దెల ముందు పొర్లు దండాలు పెడతారు. సారె, చీర, బంగారం (బెల్లం)తోపాటు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. గొర్రె, మేకపోతులు, కోళ్లను బలిచ్చి విందు చేసుకుంటారు. అయితే పెద్ద జాతరకు వెళ్లొచ్చిన భక్తులు మినీ మేడారం పేరుతో ఇంటిలోనే అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

### బంగారమే నైవేద్యం..

కాకతీయుల కాలం నుంచే మేడారం సమ్మక్క–సారలమ్మల జాతర కొనసాగుతోంది. అయితే ఏ జాతరలో అయినా భక్తులందరూ దేవుళ్లకు రకరకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. మేడారంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. అమ్మవారికి బెల్లంను నైవేద్యంగా సమర్పించేవారు. అమ్మవార్లకు బెల్లాన్ని సమర్పిస్తే.. తమ కష్టాలన్నీ తొలగిపోతాయని, తమ కుటుంబాన్ని క్షేమంగా చూసుకుంటుందని భక్తుల నమ్మకం. అందుకే ఇక్కడ బెల్లాన్ని బంగారంగా పిలిచుకుంటారు. అయితే దీనిని శాస్త్రీయ నేపథ్యం కూడా ఉందని చెప్పుకుంటారు. గతంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు ఎడ్ల బండ్లు, కాలినడకన రోజుల తరబడి అటవీ ప్రాంతంలో ప్రయాణించాల్సి వచ్చేంది. దీంతో ఆకలి వేసినప్పుడు త్వరగా శక్తిని అందించే బెల్లం పానకంతో తయారు చేసే ఆహారాన్ని భక్తులు తీసుకునేవారని ప్రచారంలో ఉంది. అందుకే అది అప్పటినుంచి చాలా విలువైనదిగా భావించి.. సమ్మక్క–సారలక్కకు సమర్పించడం ప్రారంభమైందని స్థానికులు చెబుతారు.

## మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు పూర్తి

- అధికారుల సూచనలు భక్తులు పాటించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** ఈనెల 12 బుధవారం నుంచి ప్రారంభం కానున్న మినీ మేడారం జాతరకు అన్ని ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు జిల్లా అధికారుల సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
తాడ్వాయి మండలం మేడారంలో జరుగనున్న మినీ మేడారం జాతరను పురస్కరించుకొని గత పక్షం రోజుల నుంచి పారిశుద్ధ్య పనులను చేపట్టడం జరిగిందని, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో భక్తులు జంపన్న వాగులో పుణ్య స్థానాలు ఆచరించడానికి నల్లాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందని, గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద భక్తులు ఎలాంటి ఇబ్బందుల గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. ఏటూరు నాగారం మండలం కొండాయి, ఐలాపూర్ గ్రామాలలో జరుగనున్న మినీ




మేడారం జాతరకు సైతం ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చిన్నబోయిన పల్లి గ్రామం నుంచి కొండాయి వరకు, తాడ్వాయి, ఊరటం గ్రామాల నుంచి కొండాయి వరకు భక్తులను తరలించడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని సంతోషంగా తమ గ్రామాలకు చేరుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## దేశ వ్యాప్త జనాభా లెక్కలు జరపాలి

- మాజీ ఎంపీ వినోద్ కుమార్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జనాభా లెక్కలను ప్రతీ పది సంవత్సరాలకోసారి జరపాలని, బ్రిటిష్ కాలం నుంచి ఇది ఆనవాయితీగా కొనసాగుతోందని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ అన్నారు. 2021లో జనాభా లెక్కలు జరగాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడింది. ఈ సంవత్సరంలో జనాభా లెక్కలు కచ్చితంగా జరుగుతాయని అందరూ భావించారు. అయితే ఈ బడ్జెట్ లో జనాభా లెక్కలకు కేటాయించింది రూ. 574 కోట్ల రూపాయలు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జనాభా లెక్కలు జరగపోవచ్చని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. పేదరిక నిర్మూలనకు లెక్కలు తప్పనిసరి, మోడీ దగ్గర ఏ లెక్కలు లేక గుడ్డెద్దు చేనులో పడ్డట్టు ముందుకు సాగుతున్నారు. పథకాలు సమర్థంగా అమలు కావాలంటే జనాభా లెక్కలు తప్పని సరి, మోడీ తన భాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు . జనగణన జరిగితే కుల గణన జరగాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్ నుంచి తప్పించుకునేందుకే మోడీ జన గణన చేయడం లేదనే అనుమానం కలుగుతోందన్నారు. జనాభా లెక్కలు తీయాలంటే 8 వేల కోట్ల రూపాయలు అవసరం ఉందని, 2019 బడ్జెట్ లో నిధులు కేటాయించి ఇపుడు 574 కోట్లు కేటాయించడం ఏమిటి ప్రశ్నించారు. తక్షణమే జనాభా లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ఆహార భద్రత చట్టం స్ఫూర్తి జనాభా లెక్కలు తీయకపోవడంతో దెబ్బ తింటోందన్నారు. జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల మహిళా రిజర్వేషన్ల కు కూడా విఘాతం కలుగుతోందని తెలిపారు. కొత్త జనాభా లెక్కల ప్రకారమే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావాలన్నారు. మహిళా రిజర్వేషన్లను మరో 10 ఏండ్లు వాయిదా వేసే కుట్ర జరుగుతోందనే అనుమానం వ్యక్తం చేశారు. ఆహార భద్రత చట్టం పరిధిలోకి మరింత మందిని చేర్చాల్సివస్తుందని మోడీ జనాభా లెక్కలు తీయడం లేదని విమర్శించారు. నిన్న పార్లమెంటు జీరో అవర్ లో సోనియా గాంధీ గణాంక లెక్కలపై మంచి అంశాన్ని లేవనెత్తారు. సోనియా గాంధీ ఆహార భద్రత చట్టం గురించే మాట్లాడారు తప్ప జనాభా లెక్కలకు మహిళా రిజర్వేషన్లకు ఉన్న సంబంధం గురించి మాట్లాడలేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే మోడీ జనాభా లెక్కలపై స్పష్టమైన ప్రకటన చేసి సరైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కయిందని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలవరని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండటానికి ప్రత్యేక కారణాలు ఏమీ లేవన్నారు. ఇదివరకు కూడా బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్న సందర్భాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు బ్రిటిష్ కాలం నాటి పద్ధతులు అమల్లో ఉన్నాయి.. అవి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రెస్ మీట్ లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, కె వాసుదేవ రెడ్డి, లీగల్ సెల్ సభ్యులు సి.కళ్యాణ్ రావు, హరీష్, కావ్య శ్రీ పాల్గొన్నారు.



## పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

### వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ సీపీ పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏ.ఎస్.ఐ లుగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్ కుమార్ లు మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ మార్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ వీలైనంత వరకు ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు పోవాలి

- తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- మోషన్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని మోషన్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ లో మోషన్ జూనియర్ కాలేజ్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మోషన్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమైందన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పే సమయం ఇంటర్మీడియట్ లోనే ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం ఈ ఇంటర్మీడియట్ దశ నుంచే ప్రారంభించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలంటే ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచి క్రమశిక్షణతో,







సమయపాలనతో, ప్రణాళిక బద్ధకంగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ తన గేయాలతో విద్యార్థులను అలరించారు. ప్రముఖ సైకాలజిస్ట్ బరుపాటి గోపి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పెద్దల పట్ల గౌరవంతో ఉండాలని, విద్యార్థి దశలో దురాలోచనలకు దూరంగా ఉండాలని, ఈ దశ లో క్రమశిక్షణతో కూడిన విద్యను ఎవ్వరు నేర్చుకుంటారో వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. పరీక్షల సమయంలో మానసిక ఆందోళన చెందకుండా ఎలా ఉండాలో విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజ్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనూజ్ కుమార్, సాహెయల్ కథ్యాల్, రామన్, ప్రదీప్ పట్నాయక్, అవినాష్, సురేందర్, సుధాకర్, కాలేజీ సిబ్బంది రాజు, అరుణ్, శనిగరపు సుమన్, శశి, శివ, నాగరాజు, రవీందర్, రచ్చ కుమార్, అరుణ, శిల్ప, ధరణి, మౌనిక, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కావ్యకు ఘన సన్మానం

## ప్రత్యేకంగా అభినందించిన జాతీయ క్రీడాకారుడు ప్రభు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** హైదరాబాద్ ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన మార్షల్ ఇంటర్నేషనల్ కరెక్ట్ ఛాంపియన్ షిప్ పోటీలలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు మూడు వేల మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా జన్ను కావ్య అండర్ 15-17 విభాగంలో అత్యధిక ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ పోటీలలో కటాస్ లో బంగారు పతకం సాధించారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ కు చెందిన జన్ను రమేష్ కుమార్తె జన్ను కావ్య జమ్మికుంటలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతూ హుజురాబాద్ కు చెందిన గ్లోబల్ శోటాకాన్ కరాటే దూ ఇండియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేక శిక్షణ పొంది ప్రతి పోటీలలో అత్యంత ప్రతిభను కనబరుస్తూ పతకాలు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ (ప్రభు) జమ్మికుంటలోని తన ప్రభు ఆర్ట్స్ గ్యాలరీలో కావ్యను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ కరాటే పోటీలలో బంగారు పతకమే సాధించడమే కాకుండా ఒలంపిక్స్ లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కావ్యను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించిన తండ్రి రమేష్ ను, ప్రత్యేక కరాటే శిక్షణను ఇచ్చిన ఎస్కే జలీల్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటించాలి

**వరంగల్ వాయిస్, పరకాల :** ఎన్నికల విధులు, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండవ గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల్లో బాగంగా పరకాల, నడికూడ మండలాల పరిధిలో నియమించబడిన స్టేజ్-1, 2 రిటర్నింగ్ అధికారులు, అస్టిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పరకాల రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ ఎంపీడిఓలు పెద్ది ఆంజనేయులు చేతన్ కుమార్ లు మాట్లాడుతూ ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో విధులు నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలు తూచ తప్పకుడా పాటించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన కె.రాంబాబు స్టేట్-1, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు స్టేజ్-1, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు వారు చేపట్ట వలసిన భాధ్యతలు వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ మండలాల స్టేజ్-1, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు, స్టేజ్-1 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఆలయ అభివృద్ధికి విరాళం

**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో మాఘ మాస శుక్ర చతుర్థ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గణపురం వాస్తవ్యులైన కీర్తిశేషులు మార్క శాంతమ్మ సారయ్య దంపతుల జ్ఞాపకార్థంగా కుమారులు మార్క చిన్న మొగిలి, రవి ఆలయ అభివృద్ధి కోసం రూ.5016లను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ముసునూరి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, బటిక స్వామి, మూల శ్రీనివాస్ గౌడ్, దయ్యాల భద్రయ్య, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేటర్లకు సమగ్ర సర్వే డబ్బులు చెల్లించాలి





**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే ఎన్యుమరైటర్లకు ఇవ్వాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పెండ్యాల సలింద్రం, తెలంగాణ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎండీ సర్వేర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ వేరు వేరు ప్రకటనల్లో అధికారులను డిమాండ్ చేశారు. ఎంతో శ్రమకు ఓర్చి సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన ఎన్యుమరేటర్లకు డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ములుగు జిల్లా సర్వేలో మొదటి స్థానంలో నిలిచినప్పటికీ ఇంతవరకు వారికి డబ్బులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఎన్యుమరేటర్లకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పదిలో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణినితో కలిసి మండల విద్యాశాఖ అధికారులతో పదవ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లా పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించుట కోసం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రతిరోజు వారి పరిధిలోని రెండు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో సంభాషించి చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రతి పాఠశాల వారీగా చదువులో వెనుకబడిన విద్యార్థుల వివరాలు మండల విద్యాశాఖ అధికారుల దగ్గర ఉండాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యార్థుల స్థాయిని తెలిపి మార్చిలో వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఇంటి వద్ద కూడా చదివించుటకు ప్రోత్సహించాలన్నారు. ఇప్పటివరకు చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఏ చర్యలు తీసుకున్నారో ఎంఈఓలు పరిశీలించి చదువులో



వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు నుండి అందజేయబడినటువంటి 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రతి ఒక్కరూ విధిగా అమలు చేస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకి చదువు ఆవశ్యకతను తెలుపుతూనే ఒకవేళ ఫెయిల్ అయినంత మాత్రాన విద్యార్థులు ఎలాంటి తొందరపాటు తప్పు నిర్ణయాలు తీసుకోకుండా జీవితం గొప్పతనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఈ సూర్యనారాయణ, ఏసీజీఈ అప్పని జయదేవ్, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి, ఇసుక రవాణా

## అధికారుల నిఘా, దాడులు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గత కొద్ది రోజుల నుంచి అడ్డు అదుపు లేకుండా అక్రమంగా మట్టిని, ఇసుకను దొడ్డి దారిన జేసీబీ ఓనర్లు తరలిస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారు. దీంతో విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ముకుమ్మడిగా దాడులు నిర్వహించారు. వెల్ది గ్రామంలో అక్రమ ఇసుక ట్రాక్టర్, అలాగే శివాజీ నగర్ గ్రామంలో రెండు టిప్పర్లు, ఒక జేసీబీ సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి ఎస్సై నరేష్ యాదవ్, స్థానిక తాసిల్దార్ మోజస్, డిప్యూటీ తాసిల్దార్ శంకర్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ శరత్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి వేళల్లో ఇళ్లపై రాళ్లు

## భయాందోళనలో వడ్డెర కాలనీ వాసులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాత్రి వేళల్లో తమ ఇళ్ల పై రాళ్లు పడుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్న సంఘటనమహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని వడ్డెర కాలనీ లో చోటుచేసుకుంది. మహబూబాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీలో వారం రోజుల నుంచి రాత్రి వేళల్లో ఇండ్లపై రాళ్ళు పడుతున్నాయంటూ కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లాలంటే కాలనీ వాసులు భయపడుతున్నారు. ఇద్దరు, ముగ్గురు కలిసి బయటకు వెళ్తున్నారు. రాళ్లు ఎలా పడుతున్నాయో అర్థం కాక కాలనీ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాళ్ల భయంతో కాలనీ వాసులు గస్తీ నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాలు నుంచి కాలనీ వివిధ కారణాలతో 8 మంది మృతి చెందారని, కాలనీ పరిసర ప్రాంతాల్లో చేత బడులు చేసిన ఆనవాళ్లు కనపడుతున్నాయని, కాలనీలో దెయ్యమో..? భూతమో..? లేక చేతబడి చేశారమోనని కాలనీ వాసులు ఆందోళనచెందుతున్నారు.

# కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ వైద్య కళాశాల ఉమెన్ అండ్ మెన్స్ హాస్టల్ లో 86 మంది కార్మికులకు గత 7 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ వెంటనే 7 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జిల్లపల్లి సుధాకర్ మాట్లాడుతూ 86 మంది హాస్టల్ వర్కర్స్ 7 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం నుంచి పనులు బంద్ చేసి ఆందోళన చేస్తామని అధికారులకు తెలియచేశారు. ఇప్పటికైనా కలెక్టర్ వెంటనే స్పందించి 7 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ బ్రాంచి నాయకులు అల్లం రమేష్, రాణి, రాజకుమారి, రాము, శశి, మంద కవిత, రవి, బాబు, వంశీ, సుమన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో ఫిబ్రవరి 15న జరగబోయే బంజారాల ఆరాధ్య దైవం, బాల బ్రహ్మచారి సద్గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించే శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ టీక్యా తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేష్ బాబు జిల్లాలో ఉన్న యావత్ బంజారాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఆలోచన విధానం, వారి మార్గదర్శకత్వం గిరిజన బంజారాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. వారు బోధించిన సిద్ధాంతం బంజారాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. తొర్రూరు మండల కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి తక్షణమే ఒక ఎకరం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఉద్యోగస్తులకు పూర్తి స్థాయి సెలవు కేటాయిస్తూ క్యాలెండర్ ఇయర్ లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, నవీన్, అఖిల్ ,భోజన, యాకీ, కిమే, తార, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి




**వరంగల్ వాయిస్, ములుగు :** ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 87- ఎంపీటీసీ, 10-జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుంచే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసుకుని, నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎంపీడీఓలు, ఆర్ఓలు, సహాయ ఆర్ఓలు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పన్ను వసూళ్లలో పురోగతిని అవసరమని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. బల్దియా పరిధి నక్కల గుట్ట సర్కిల్ కార్యాలయంలో గల సీఎస్సీ సెంటర్ , ఈ-సేవా కేంద్రాన్ని కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రోజు వారీగా పన్ను వసూళ్ల తీరును సిబ్బందిని అడిగి తెలుసుకొని నిర్వహిస్తున్న పన్ను వసూళ్ల నమోదు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకునే తరుణంలో పన్ను వసూళ్లలో వేగం పెంచి నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవాలని, వినియోగదారులకు పన్ను చెల్లింపు సంబంధిత రశీదు అందజేయాలని, ఇందుకోసం ప్రింటర్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు రిజిస్టర్ లో నమోదు తప్పనిసరి అని అన్నారు. నెల వారీ వసూళ్ల సంబంధ రికార్డు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల అవగాహన కోసం పన్నులు చెల్లించాలని కోరుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత లక్ష్యం వైపు దూసుకెళ్లాలి

## ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** యువత లక్ష్యం వైపు దూసుకెళ్లాలని హసన్ పర్తి ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజేతల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గం వైపుగా పయనించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా సమాజంలో గౌరవంగా జీవించాలని యువతను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సునీత, ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు శీలం పార్థసారధి, వాసు దేవరావు, పూర్వపు వలంటీర్ మండ రాజేష్, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం అధికారి బానోతు దేవీలాల్, ఆఫీసు సిబ్బంది సీహెచ్.రాజేశ్వరరావుతో పాటు

# వికలాంగుల చట్టం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు తోట బాబన్న ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా 2016- వికలాంగుల చట్టం గూర్చి తెలిపే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని ఈ క్రింది వికలాంగుల సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో వరంగల్ జిల్లాలో వికలాంగులపై దాడులు, దౌర్జన్యాలు, భూ అక్రములు, అక్రమ కేసులు వంటివి కొన్నిచోట్ల జరుగుతున్నాయి. కాబట్టి, ఈ విషయంలో 2016- దివ్యాంగుల చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా 2016-దివ్యాంగుల చట్టం గూర్చి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని దానిలో మా జిల్లా వికలాంగుల కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. అదే విధంగా 2016-దివ్యాంగుల చట్టం గూర్చి తెలిపే వాల్ పోస్టర్లను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గై సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, కోశాధికారి దీకొండ సాయిరామ్, సభ్యులు ఎండీ సాదిక్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

➲ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇసుకాసురలపై కఠినంగా వ్యవహరించాలని, కేసులు నమోదు చేసి కట్టుదిట్టం చేయాలని అధికారులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అదేశించారు. జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై పోలీసు శాఖ దాడులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎవరైనా ఇసుక రవాణా చేస్తే కఠినమైన సెక్షన్స్ కింద (పీడీపీపీ ఆక్ట్, మైన్స్ ఆక్ట్) కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా, నిరోధించేందుకు 100కు డయల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎవరైనా, ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలించినా, అధిక ధరలకు విక్రయించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల భద్రత చర్యలు చేపట్టనున్నట్టు సూచించారు. పోలీసు వారి సూచనలకు విరుద్ధంగా ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక తరలించేందుకు, విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు. ఇతరులు ఎవరైనా తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్స్ అని, ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హెచ్చరించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, ములుగు :** మల్లంపల్లి మండలం మల్లంపల్లి గ్రామంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల కిందట తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనతో గత వారం రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని మంగళవారం సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య బోధించిన గురువులకు మెమొంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. అప్పటి బాల్య స్నేహితులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తమ ఉపన్యాసాలలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన తోటి విద్యార్థి మరణించిన స్వామి కుటుంబానికి తమ వంతు కృషిగా ఆర్థిక సహాయం అందించిన పరిపూర్ణ చారి, సునీల్, సతీష్, పాపరావులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సమ్మేళనం కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, 70మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయూలో ఓఎస్డీ పోస్టును తొలగించాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ముందు అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఓఎస్డీ పోస్టును తొలగించాలని మంగళవారం మల్లారెడ్డి ఫోటోలు చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తూ ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో ఎప్పుడూ లేని విధంగా ఓఎస్డీ పోస్టును క్రియేట్ చేసి మల్లారెడ్డికి బాధ్యతలు అప్పగించడం సిగ్గుచేటని అన్నారు. గత సంవత్సరం రిజిస్ట్రార్ పదవీ ఉన్న సమయంలో విద్యార్థులకు అధికగా పరీక్ష ఫీజులు పెంచినా ఇబ్బందులకు గురిచేసిన మల్లారెడ్డికి ఓఎస్డీ పోస్ట్ ను అప్పగించడం అభ్యంతకరమని మండిపడ్డారు. అదేవిధంగా ఎన్నో భూకబ్జాల పేరిట అనేక పత్రికల్లో చర్చనీయాంశంగా మారిన మల్లారెడ్డికి ఇచ్చిన పోస్ట్ ను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రామ గ్రామాన సంస్థాగత నిర్మాణం చేసి బీసీల ఉద్యమ పోరాటాన్ని బలోపేతం చేస్తామని, ప్రతి పల్లెలో బీసీ జెండాను ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్ అన్నారు. మంగళవారం బీసీ ఆజాది ఫెడరేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖిలా వరంగల్ మండలం, బొల్లికుంట గ్రామానికి చెందిన శీలం శ్రీనివాస్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కుడికాల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీసీలను సంఘటితం చేస్తూ సంస్థాగతంగా నిర్మాణం చేస్తామని సంస్థాగత నిర్మాణంతో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారిని అభివృద్ధి చేయడమే దేశ అభివృద్ధి అవుతుందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటాకోసం, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం, దేశ వ్యాప్త కుల గణన కోసం, బీసీ అట్రాసిటీ చట్టం కోసం నిరంతరం పోరాడుతామని రాజీలేని ఉద్యమాల వలన బీసీల హక్కుల సాధనే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి జినుకల లక్ష్మణ్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గజవెల్లి మనోహర్ పాల్గొన్నారు.

# కేయూ దూరవిద్య నూతన సంచాలకుడిగా ప్రొఫెసర్ బి.సురేష్ లాల్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం నూతన సంచాలకుడిగా ప్రొఫెసర్ పి.సురేష్ లాల్ మంగళవారం ప్రొఫెసర్ రామచంద్రం నుంచి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయం పలు పరిపాలన అధికారులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులు ప్రొఫెసర్ బి.సురేష్ లాల్ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దూరవిద్య కేంద్రంలోని ఉద్యోగులు సంచాలకులు సురేష్ లాల్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యోగ సంఘం నాయకులు, దూర విద్యా కేంద్రం బోధన బోధనేతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు ప్రొఫెసర్ సురేష్ లాల్ ను కలిసి పూలమాలతో సత్కరించారు.

# కుల గణన రిపోర్టు ఆమోదయోగ్యం కాదు

➲ బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన రిపోర్టులో బలహీనవర్గాల జనాభాకు సంబంధించిన సమాచారం అశాస్త్రీయంగా ఉండటం వలన బీసీలకు జరుగుతున్న నష్టాన్ని అన్యాయాన్ని లోక్ సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి లేఖ ద్వారా తెలియజేస్తున్నామని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు తెలియజేశారు. మంగళవారం వివిధ కుల సంఘాలు బీసీ సంఘాల నాయకులతో హనుమకొండ హరిత కాకతీయ హోటల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శేషు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కుల గణన రిపోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51శాతం ఉన్న బీసీల జనాభా 46 శాతానికి ఎలా తగ్గింది,1.88 కోట్లుగా ఉన్న బీసీల జనాభా 1.64 కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వకుండా బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళుతున్నామని తెలియజేశారు. కులగణన సర్వేలో సంచార జాతులు, వలస కూలీల పూర్తి సమాచారం సేకరించకుండా బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారని విమర్శించారు. కుల గణన రిపోర్టులో రాష్ట్ర జనాభా, కుటుంబాలకు సంబంధించిన సమాచారం కూడా ఆసమగ్రంగా ఉందని అభిప్రాయపడ్డారు. కుల గణన రిపోర్టుపై బీసీ సామాజిక వర్గాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా అభ్యంతరాలపై పున సమీక్ష చేయకుండా ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంభిస్తుందని విమర్శించారు. కుల గణన రిపోర్టుపై బీసీలకు ఉన్న అభ్యంతరాలను రాహుల్ గాంధీకి మెయిల్ ద్వారా తెలియజేస్తూ జోక్యం చేసుకొని బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ సమయం ఇస్తే కులగణనపై ఉన్న అభ్యంతరాలపై పూర్తి సమాచారం అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దారిబోయిన సతీష్, నూతనకంటి ఆనందం, నేదునూరి రాజమౌళి, ప్రతాపగిరి విజయకుమార్, సోమిడి అంజన్ రావు, ఐలాపురం వేణు చారి, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాక్టర్ రమేష్, యశ్వంత్ యాదవ్, వంగపండ్ల నరేందర్, వినయ్ చారి, డేనియల్, కృష్ణ, కుమార్, రాచకొండ ప్రవీణ్, దామెర కొండ, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ప్రభుత్వ పాఠశాల మడికొండలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను మంగళవారం హెచ్ కానిస్టేబుల్ జయరాజు అందజేశారు. పదో తరగతి ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా దాతలు ముందుకు వచ్చి మరికొన్ని పుస్తకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్, స్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరాం బెస్ట్ డీఓగా సునీత



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మహబూబాబాద్ ఖమ్మం డివిజన్ బెస్ట్ డెవలప్ మెంట్ ఆఫీసర్ గా డోర్నకల్ పట్టణానికి చెందిన నల్లబోలు సునీత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ లో సోమవారం రాత్రి జరిగిన బెస్ట్ అచీవర్స్ అవార్డ్స్ లో ఎండీ శేఖర్ చేత సన్మానం పోంది అవార్డు అందుకున్నారు. శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రజలకు మరింత సేవలు అందించాలని ఎండీ సూచించారు.

# దీపాదాస్ మున్షిని కలిసిన ఎమ్మెల్యేలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షిని హైదరాబాద్ లో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహర, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

# వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా అంబాల రాజ్ కుమార్



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజ్ కుమార్ ను నియమిస్తున్నట్లు వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ ఫౌండర్/ చైర్మన్ డా.నలమాస శ్రీకాంత్ గౌడ్ ఆదివారం హనుమకొండ రాధా గార్డెన్స్ లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ వినియోగ దారుడిని మేల్కొలిపే దిశగా పని చేయాలని, ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు అంబాల రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే చల్లాను కలిసిన పీఏసీఎస్ చైర్మన్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పీఏసీఎస్ చైర్మన్ గా తిరిగి బాధ్యతలు చేపట్టిన గుండెబోయిన నాగయ్య, కమిటీ సభ్యులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ఆదేశాలతో తిరిగి చైర్మన్ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ నాగయ్యను, కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

■ **సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీని ఓడించడంలో చతికిల పడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. భారత దేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు. చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగి పోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని అన్నారు. ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని, దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని అన్నారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీకి బలమున్న స్థానాలలో పోటీకి సమాయత్తం కావాలన్నారు. ఈ సందర్భంగా సీపీఐ శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పార్టీ జిల్లా నాయకులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల అద్యక్ష, కార్యదర్శులకు పార్టీ సాహిత్యం, బుక్ లెట్ లు, మెమెంటో లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునగాల భిక్షపతి, నాయకులు జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, అనుకారి అశోక్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, కండె నర్సయ్య, ఏదునూరి వెంకట్రాజం, రమేష్ దీవా, నిమ్మల మనోహర్, రమా, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, గోకన రాజయ్య, ఇల్లందుల రాములు, కొంగర రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన, ముందు జాగ్రత్తతో వ్యాధుల నివారణ సాధ్యం




**వరంగల్ వాయిస్, కేయూ :** "అవగాహన, ముందు జాగ్రత్త తో వ్యాధుల నివారణ సాధ్యం" అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం అధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన జిల్లా స్థాయి హెచ్ఐవీ/ఎస్టీఐ అవగాహనా కార్యక్రమం "రెడ్ రిబ్బన్ క్లబ్"ను ప్రారంభించారు. అనంతరం వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారవద్దన్నారు. మానవ జీవితానికి ఒక సార్థకత ఉండాలని, ప్రజలలో అవగాహన కల్పించటం జాతీయ సేవా పథకం వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. అవగాహనతో ఎంతటి సమస్యనైన దూరం చేయవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ క్షణికావేశంలో నిర్ణయాలు వద్దు, మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ కు దూరంగా, జీవిత లక్ష్యానికి దగ్గరగా ఉండాలి, తల్లితండ్రుల కలలు నేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న మాధురి, పి.భవానితో పాటు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

# నాయినికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అవకాశం కల్పించాలి

**కాంగ్రెస్ ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరి పవన్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అవకాశం కల్పించాలని ఓబీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరి పవన్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 40ఏళ్ల నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ కార్యకర్తలను కాపాడుకుంటూ క్రమశిక్షణ కార్యకర్త లాగా ఉన్నాడు. గతంలో అధికార పార్టీ ఇబ్బందులు పెట్టినప్పుడు కూడా ఎప్పుడు పార్టీ మారలేదు. కాంగ్రెస్ పార్టీకి సైనికుడి లాగా పని చేస్తున్న నిజాయితీ గల వ్యక్తి నాయిని రాజేందర్ అని తెలిపారు. అలాంటి వ్యక్తికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అవకాశం కలిపిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకున్నా పార్టీ కోసమే పని చేశారు. కాబట్టి నాయిని రాజేందర్ రెడ్డికి అవకాశం కల్పించాలని కోరారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

■ **స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్**



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసి వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని లక్ష్మీదేవిపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అన్నారు. లక్ష్మీదేవి పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సూత్రాల రవి పర్యవేక్షణలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అన్ని రంగాలలో ప్రవేశం కలిగేలా చూడడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని ఉత్తమంగా తీర్చిదిద్దితే అభివృద్ధి పథంలో నడుస్తారని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని నిజం చేసేందుకు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండీ సర్వర్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో చిత్రలేఖనంతో పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబర్డినేట్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు కొత్తపల్లి ఆనందం, సీనియర్ ఉపాధ్యాయులు, కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక ఆర్గనైజింగ్ సెక్రటరీ పెండ్యాల సలేంద్రం, ఉపాధ్యాయులు సాంబయ్య, సోనాలిక శ్రీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆ హీరో కోసం భారీ సినిమాను రిజక్ట్ చేసిన అనన్యపాండే



బాలీవుడ్ బ్యూటీ ‘‘ అనన్య పాండే ‘‘ గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రముఖ బాలీవుడ్ నటుడు చుంకి పాండే కుమార్తెగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ.. ‘స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2’ ఫిల్మ్‌తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఈమె.. తెలుగులో కూడా ఒక సినిమాలో నటించింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లైగర్ సినిమాతో పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ అంచనాలతో రిలీజ్ అయినప్పటికీ డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. దాంతో తెలుగులో మళ్లీ మరో సినిమాకు ఓకే చెప్పలేదు. రీసెంట్ గానే లైగర్ సినిమాను అనన్య అయిష్టంగానే ఒప్పుకుందని చుంకీ పాండే చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో అనన్య పాండేకి సంబంధించి ఓ వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు హీరోయిన్స్. ఇక పలువురు హీరోయిన్లు అయితే కొంతమంది స్టార్ హీరోలు, దర్శకుల సినిమాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు. కానీ కొన్ని సార్లు డేట్స్ అడ్జెస్ట్ అవ్వక ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకుంటారు. ఇప్పుడు అనన్య పాండే డైరెక్టర్ ఇంతియాజ్ అలీ తెరకెక్కిస్తున్న సినిమాలో ఆఫర్ వచ్చిందట. బాలీవుడ్ లో ఇంతియాజ్ అలీ ప్రేమకథలు తెరకెక్కించడంలో మంచి పేరుంది. ఇంతియాజ్ ఓ భారీ బడ్జెట్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఆ సినిమాలో హీరోయిన్ గా అనన్యను అనుకున్నారట. అయితే కార్తీక్ ఆర్యన్ సినిమా షూటింగ్ లో ఆమె బిజీగా ఉండటంతో డేట్స్ అడ్జెస్ట్ కాక ఇంతియాజ్ అలీ సినిమాను రిజెక్ట్ చేసిందట.

## సూర్యతో నటించడం గర్వంగా ఉంది : పూజా హెగ్డే

హీరో సూర్య నటించే 69వ చిత్రంలో తాను కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉందని ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ‘రెట్రో’ మూవీ చిత్రీకరణ పూర్తి చేసి మే ఒకటో తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇందులో తనకు దక్కిన అవకాశంపై పూజా హెగ్డే మాట్లాడుతూ.. ‘ఇప్పటివరకు నేను నటించిన చిత్రాలన్నీ నన్ను గర్వపడేలా చేశాయి. కానీ, ‘రెట్రో’ మాత్రం నేను గర్వించే చిత్రంగా ఉంటుంది. ఇందులోని ప్రతి సన్నివేశం నాకు చాలా ఇష్టం. షూటింగు సమయంలో పొందిన అనుభూతి ఎన్నటికీ మరిచిపోలేనిది. సినిమా ఇంకా చూడకుండానే గట్టి నమ్మకంతో చెబుతున్నాను. ప్రస్తుతం ‘రెట్రో’ మూవీ ఎడిటింగ్ జరుగతోంది. త్వరలోనే మేకర్స్ ఆడియో, ట్రైలర్ రిలీజ్ తేదీలు వెల్లడిస్తారు’ అని వివరించారు. ప్రస్తుతం తమిళంలో విజయ్ తో ‘జన నాయగన్’, ‘కాంచన 4’ చిత్రాలతో బిజీ గా ఉన్నారు.



## హీరో కోసం కోట్ల ఆస్తిని రాసిచ్చింది..

హీరో అభిమాని ఏకంగా కొన్ని కోట్ల విలువైన తన ఆస్తిని స్టార్ హీరో పేరు మీద రాసిచ్చి చనిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. సదురు హీరో చలించిపోయాడు. ఇంతకు ఏం జరిగిందంటే.. ముంబైకు చెందిన నిషా పాటిల్ కు నటుడు సంజయ్ దత్ అంటే పిచ్చి అభిమానం. చిన్నప్పటి నుంచి ఆయన్ను ఆరాధిస్తూ పెరిగింది. నామ్ నుంచి ఖల్ నాయక్ దాకా, సంజు నుంచి కెజిఎఫ్ 2 దాకా ప్రతి చిత్రాన్ని కొన్ని వందల సార్లు చూసింది. లెక్కలేనంత డబ్బు టికెట్లకే పెట్టింది. అయితే ఇటీవల నిషా పాటిల్ కన్నుమూసింది. ఆమె వయసు 62 సంవత్సరాలు. కన్నుమూసే నాటికి సుమారు 72 కోట్ల రూపాయల ఆస్తి నిషా పేరిట ఉంది. కాగా, అదంతా సంజయ్ దత్‌కు రాసేసి వెళ్లిపోవడం కుటుంబ సభ్యులను షాక్ కు గురి చేసింది. తన చివరి రోజులను ముందే గుర్తించిన నిషా పాటిల్ ఆస్తి డాక్యుమెంట్లను 2018లోనే లీగల్ గా రాయించి, బ్యాంకు అకౌంట్లలో ఉన్న డబ్బుని సంజయ్ దత్ కి అందజేయాలని లెటర్లు రాసి పక్కాగా బదలాయింపు చేసింది. ఇదంతా ఇంటికి దస్తావేజులు వచ్చాక కానీ.. సంజు బాబాకు మేటర్ అర్థం కాలేదు. అసలు పరిచయమే లేని ఒక అపరిచితురాలు ఆస్తి రాసివ్వడం చూసి నివ్వెరపోయాడు. విషాదం ఏంటంటే నిషా పాటిల్ ఇప్పటిదాకా సంజయ్ దత్ ని ప్రత్యక్షంగా కలవలేదు. కానీ.. తన హీరో మీద ప్రేమతో కోట్ల రూపాయలు కానుకగా ఇచ్చింది. సంజయ్ దత్ వాటిని స్వీకరించలేదు. త్వరలోనే వాళ్ళ ఫ్యామిలీకే అవి తిరిగి చెందేలా తన లీగల్ టీమ్ ని పురమాయించారు. ఇంత వీరాభిమానిని కలుసుకోలేకపోవడం కలవపరిచిందని, కనీసం కుటుంబ సభ్యులనైనా కలిసి కొంత ఊరట చెందుతానని సంజయ్ దత్ పేర్కొన్నారు.

## పిచ్చెకించిన ఎన్టీఆర్ వీడీకి వాయిస్ ఓవర్‌తో ప్రాణం

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది విజయ్‌కు 12వ చిత్రం. వీడీ12 అనే వర్కింగ్ టైటిల్‌తో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ రివీల్ చేసేందుకు మేకర్స్ డేట్ ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. చిత్ర నిర్మాణ సంస్థతో పాటు, హీరో విజయ్ దేవరకొండ ఈ సినిమా టైటిల్, టీజర్‌ను విడుదల చేసే సమాచారాన్ని ట్విట్టర్ వేదికగా వెల్లడిరచారు. ఫిబ్రవరి 12వ తేదీన ఈ చిత్ర టైటిల్, టీజర్ విడుదల కానుంది. అయితే ఈ టీజర్‌కు తమిళ్‌లో సూర్య, హిందీలో రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందిస్తుండగా.. తెలుగులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ అందిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం నాడే ఈ వాయిస్ ఓవర్ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలోనే హీరో విజయ్ దేవకొండ ‘ఎక్స్’ వేదిక ద్వారా ఆసక్తికరమైన పోస్టు షేర్ చేశాడు. ‘‘నిన్న చాలాసేపు ఎన్టీఆర్ అన్నతోనే ఉన్నా. వ్యక్తిగత జీవితం, సినిమా తదితర అంశాల గురించి మాట్లాడుకున్నాం. నా టీజర్ కు వాయిస్ ఇచ్చి ప్రాణం పోశాడు. టీజర్ బయటకు ఎప్పుడొస్తుందా అని నేను ఉత్కంఠతో ఎదురుచూస్తున్న. తారక్ అన్న మ్యాడ్‌నెస్‌ని మా ప్రపంచానికి అందించినందుకు థ్యాంక్స్.’’అంటూ రాసుకొచ్చాడు. దీంతో దేవరకొండ అభిమానులతో పాటు తారక్ అభిమానులు కూడా మురిసిపోతూ కామెంట్స్ పెడుతున్నారు. ఈ సినిమాలో విజయ్ పోలీస్ అధికారిగా కనిపించనున్నారు. విజయ్ దేవరకొండను పవర్‌ఫుల్‌గా చూడనున్నారని ఇటీవల నిర్మాత ఓ ఇంటర్వ్యూలో అన్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.





# ఆపద మిత్ర వలంటీర్లు ఉత్తమం సేవలందించాలి

- సంస్కృతి విహార్ లో వారికి శిక్షణ
- ప్రారంభించిన అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆపద మిత్ర వలంటీర్లు అత్యుత్తమ సేవలను అందించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ లోని శిక్షణ కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపద మిత్ర వలంటీర్లకు 12 రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్నిఅదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆపదమిత్ర వలంటీర్లు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఇతర శాఖల సమన్వయంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి కాపాడటంలో ఆపద మిత్ర వలంటీర్లు సేవలందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా ఆపదలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించవచ్చనే మెలకువలను ఆపదమిత్ర వలంటీర్లు శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఫైర్ అధికారి కొండం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మేము చెప్పే మెలకువలు నేర్చుకొని ఆపద కాల సమయంలో వారిని రక్షించు కోవడానికి, పక్కవారిని కూడా రక్షించుకోవడానికి, పనికి వస్తాయని అంతేకాకుండా సమాజ సేవ చేసిన వారమవుతావని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఫైర్ అధికారి కె.వెంకట సతీష్ కుమార్, హసన్ పర్తి తహసీల్దార్ ప్రసాద్, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారం జాతరకు పటిష్ట భద్రత

- 1000 మందితో పోలీసుల బందోబస్తు
- ములుగు ఎస్పీ శభరీష్




**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలో రేపటి నుంచి జరుగనున్న మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసు డిపార్ట్ మెంట్ పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఆఫీసర్ నుంచి మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు దాదాపు 1,000 మందికి ఈ మినీ మేడారం లో బందోబస్తు డ్యూటీ లు వేయడం జరిగింది. బందోబస్తులో భాగంగా ములుగు జిల్లా పోలీసులతో పాటు ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల నుంచి సిబ్బంది వచ్చారు. బందోబస్తులో ముఖ్యంగా నాలుగు అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. కాగా, మంగళవారం సాయంత్రం ములుగు ఎస్పీ శభరీష్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ట్రాఫిక్ కంట్రోల్ లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం డైవర్షన్ పాయింట్లు, పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రోడ్లమీద పార్కింగ్ చేయకుండా ఎప్పటికప్పుడు సమీక్షించే విధంగా బైక్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు. డ్రోన్ ల ద్వారా, అలాగే కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ ను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉంటారు. అనుకోని సందర్భంలో ఏదైనా వెహికల్ సమస్య వలన ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయితే వెంటనే ట్రాఫిక్ జామ్ క్లియర్ చేయడానికి వీలుగా జెసిబిలను, టోయింగ్ వెహికల్స్ ను సిద్ధంగా ఉంచారు. మేడారానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో, గద్దెల వద్ద బందోబస్తు చేసే సిబ్బంది భక్తులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మేడారానికికు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగింది. క్రైమ్ స్టాప్ గద్దెల వద్ద, జంపన్న వాగు పరిసర ప్రాంతాలలో అలాగే క్యూలైన్లలో మఫ్టీలలో తమ విధులు నిర్వహిస్తూ ఉంటారు ఎటువంటి దొంగతనాలు జరగకుండా నిత్యం పహారాకాస్తు ఉంటారు. అలాగే పాత నేరస్తుల వివరాలను ప్రతి ఒక్క క్రైమ్ సిబ్బందికి తెలియపరచడం జరిగింది. వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఎవరైనా అనుమానితులుగా వ్యవహరిస్తే వెంటనే అదుపులోకి తీసుకునే విధంగా దిశా నిర్దేశం చేయడం జరిగింది. అలాగే పాత నేరస్తులను గుర్తుపట్టే విధంగా ఇన్ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మినీ మేడారం జాతర సందర్భంగా వివిఐపీలు దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది.

# ఆదరబాదరా నివేదికతో బీసీలకు మోసమే

## డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన రావు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో, బీసీ రిజర్వేషన్లను నిర్ణయించటానికి ఏర్పాటైన భూసాని వెంకటేశ్వరరావు డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను అత్యంత గోప్యంగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారికి అందజేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రధాన కార్యదర్శి కార్యాలయం కూడా అధికారికంగా తెలియజేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. వెంటనే రిపోర్ట్ లో ఉన్న అంశాలు అన్నీ బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఆమోదించిన అనంతరం వెలువరించడంలో అభ్యంతరం లేదు. అయితే నివేదిక స్వీకరించిన విషయం కూడా అధికారికంగా ప్రభుత్వం ప్రకటించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇంటింటికి వెళ్లి నిర్వహించిన సామాజిక, ఆర్థిక కుల సర్వేలో 'బీసీల జనాభా' తగ్గిందని, రాష్ట్రవ్యాప్తంగా బీసీలు నిరసనలు వ్యక్తం చేస్తున్న సందర్భంగా... గత శనివారం నాడు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంఘాల ప్రతినిధులు, మేధావులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారితో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. కాగా, ఆ సమావేశంలో ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు, డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చి, మూడు రోజులైనా కాకముందే, ఏ డిమాండ్ ను నెరవేర్చకుండా ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదికను రహస్యంగా తెప్పించుకోవడం బీసీలను నిట్ట నిలువునా మోసం చేయడం. తీరని అన్యాయం, దగా చేయడం. ప్రతిష్టాత్మకంగా భావించే కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించక పోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల తన నిబద్ధతను, నిజాయితీని నిరూపించుకోవడానికి రాష్ట్రంలో రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. లెక్కలు సమగ్రంగా శాస్త్రీయంగా సేకరించాలని, కులాల వారీగా జనాభాను ప్రకటించాలన్నారు. అలాంటి సంపూర్ణమైన గణాంకాలు సమాచారంతో, డెడికేటెడ్ కమిషన్ తిరిగి తన అధ్యయనంను నిబద్ధతగా కొనసాగించాలి. అలా బీసీలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# జబల్ పూర్ రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా వాసి మృతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ జిల్లా పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద మృతుల్లో జనగామ జిల్లాకు చెందిన ఉన్నారు. ఈ ఘటనలో మరణించిన ఏడుగురిలో రామరాయ బంగ్లా చెందిన కల్యూరి బాలరాజు అక్కడిక్కడే మృతిచెందినట్లు సమాచారం. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం రామరాయ బంగ్లా ఆర్ఆర్ బంగ్లా చెందిన కొల్లూరి బాలరాజు డ్రైవర్ కమ్ ఓనర్ హైదరాబాద్ నాచారం కార్తీకేయ నగర్ వాసులను ప్రయాగ్ రాజ్ తీసుకెళ్లాడు. తిరిగి వస్తుంటే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సీఎం రేవంత్‌తో మందకృష్ణ భేటీ


## ఎస్సీవర్గీకరణ నివేదకలో లోపాలున్నట్లు వెల్లడి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌తో ఆయన భేటీ అయ్యారు. వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించారని కృతజ్ఞతలు తెలిపారు. అయితే కొన్ని లోపాలు ఉన్నాయంటూ ఆయన సిఎం దృష్టికి తీసుకుని వెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. 'సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. అందుకే వారికి ధన్యవాదాలు తెలిపాం. నివేదికలో ఉన్న లోటుపాట్లను సరిచేస్తారని ఆశిస్తున్నాం'అని మందకృష్ణ అన్నారు.

# జనగామలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయండి

## ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, జనగామ :** ఢిల్లీలో నేడు కేంద్ర పాఠశాల విద్య శాఖ సెక్రటరీ సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ ప్రాచీ పాండే తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జనగామ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. జనగామ జిల్లాలో అత్యధికంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారని, ఈ ప్రాంతం తక్కువ అక్షరాస్యత రేటును కలిగి ఉందని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేస్తే ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆమె వివరించారు. జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాన్ని కేటాంచడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జనగామ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు జరిగితే విద్యార్థులు ఇక్కడకు చేరుకోవడానికి మెరుగైన రవాణా సౌకర్యం ఉందని, ఇటు నేషనల్ హైవేతో పాటు రైల్ మార్గం కూడా అందుబాటులో ఉన్నట్లు



ఎంపీ తెలియజేశారు. ఎంపీ అభ్యర్థన పట్ల కేంద్ర పాఠశాల విద్య శాఖ సెక్రటరీ సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమీషనర్ ప్రాచీపాండే సానుకూలంగా స్పదించినట్లు ఎంపీ తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com